దంతాలతో 125 కిలోలు ఎత్తి గిన్నిస్ రికార్డ్

మీరట్, ఫిబ్రవరి 17: ఇటలీలోని ప్రముఖ నగరం 'మిలాన్'లో నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ పోటీల్లో, దంతాలతో 125 కిలోల బరువు ఎత్తి మీరట్‌కు చెందిన వికాస్‌స్వామి ప్రపంచ రికార్డ్ నెలకొల్పాడు. ఫిబ్రవరి 14న మిలాన్‌లో జరిగిన పోటీల్లో స్వామి తన పంటి బలంతో 125 కిలోల బరువును 35.57 సెకండ్లపాటు ఎత్తారు. తద్వారా సరికొత్త ప్రపంచ రికార్డ్ నెలకొల్పినట్టు తాజాగా ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. మిలాన్ పోటీల్లో పాల్గొని ఆదివారం ఇంటికి చేరుకున్న అతడికి స్వగ్రామంలో ఘన స్వాగతం లభించింది. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి గుర్తింపు లభించలేదని ఆయన వాపోయారు. అథ్లెట్స్, ఇతర క్రీడాకారులకు లభించినట్టుగా, ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి మద్దతు లభించటం లేదని వికాస్ స్వామి అన్నారు. తన విజయాలపై స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు స్పందించలేదని, కానీ తన గ్రామస్థులు తనను గౌరవిస్తున్నారని ఆయన అన్నారు. దంతాల బలం కోసం టూత్‌పేస్ట్‌లు, ఇతర ఉత్పత్తులు ఏవీ వాడటం లేదని, కఠినమైన యోగా సాధనతో ఇంతటి బలాన్ని సాధించినట్టు వికాస్ స్వామి విలేకర్లకు చెప్పారు.

కూరగాయలతో కాలేయ క్యాన్సర్‌కు చెక్

న్యూఢిల్లీ : రోజూ కూరగాయలు తినటం ద్వారా కాలేయ క్యాన్సర్ ముప్పును 65శాతం వరకు అడ్డుకోవచ్చునని ఫ్రెంచ్ సైంటిస్టుల అధ్యయనం తేల్చింది. కూరగాయలు, పండ్లు తినటం వల్ల ఏమైనా లాభముందా? అని 179 మంది లివర్ క్యాన్సర్ రోగులపై ఫ్రెంచ్ సైంటిస్టులు అధ్యయనం చేశారు. రోజూ అదనంగా 240 గ్రాముల కూరగాయలు తినటం ద్వారా రోగుల్లో వ్యాధి తగ్గుదల 65 శాతం వరకు కనపడిందని పరిశోధనలో తేలింది. దీనిపై విస్తృతస్థాయి పరిశోధనలు చేయాల్సిన అవసరముందని శాస్త్రవేత్తలు చెప్పారు.

ఇంట్లో 300 పిల్లులు!

దుర్వాసన భరించలేక స్థానికుల ఫిర్యాదు

పుణె, : ఇంట్లో 300 పిల్లులను పెంచుతున్న ఓ మహిళపై సొసైటీ వాసులు ఫిర్యాదు చేయడంతో మహారాష్ట్ర పశు సంవర్ధక శాఖ, పోలీసు అధికారులు ఇక్కడి హౌసింగ్ సొసైటీలోని ఓ ఫ్లాట్‌ను సందర్శించారు. తన ఇంట్లో ఉన్న పిల్లులను వేరే చోటికి తరలించవలసిందిగా ఆ మహిళకు నోటీసు అందచేసినట్టు ఇక్కడ హడప్సర్ పోలీసు స్టేషన్ అధికారి ఒకరు సోమవారం తెలిపారు. ఆ ఫ్లాట్ దుర్గంధభరితంగా ఉందని, పిల్లులను వేరే చోటుకు తరలించాలని ఆదేశించినట్టు పోలీసు అధికారి చెప్పారు.

ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో భూకంపం

- కొన్ని గంటల్లోనే బిహార్‌లోనూ..
- రిక్టర్ స్కేలుపై 4.0 తీవ్రత నమోదు

న్యూఢిల్లీ: ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోని వివిధ ప్రాంతాల్లో సోమవారం తెల్లవారుజామున 5.36 గంటలకు భూకంపం సంభవించింది. ఆ తర్వాత కొన్ని గంటలకే బీహార్‌లోనూ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 4.0గా నమోదైంది. ఢిల్లీలోని దౌలా కువాన్‌లోగల దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కాలేజ్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ సమీపంలో హూమిలో 5 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్టు జాతీయ భూకంపాల పరిశోధనా కేంద్రం తెలిపింది. చెరువు సమీపంలో ఉన్న ఆ ప్రాంతంలో ప్రతి రెండు, మూడేళ్లకు చిన్న, తక్కువ స్థాయి తీవ్రతతో భూప్రకంపాలు చోటుచేసుకుంటున్నాయి. 2015లో ఈ ప్రాంతంలో 3.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. భూకంపం సంభవించినపుడు భూమి లోపల నుంచి భారీ శబ్దం వినిపించినట్టు భూకంప కేంద్ర అధికారి ఒకరు తెలిపారు. ఢిల్లీ, నోయిడా, గ్రేటర్ నోయిడా, ఘజియాబాద్‌లో భూమి కంపించడంతో ఎత్తయిన భవనాల్లో ఉన్న ప్రజలు తమ నివాసాల నుంచి భయంతో బయటకు పరుగులు తీశారు. మళ్లీ భూప్రకంపనలు వస్తాయన్న భయంతో ప్రజలు తమ ఇళ్ల బయటే నిలబడి ఉండడం అనేక చోట్ల కనిపించింది.

చైనాను శత్రువుగా చూడొద్దు!

- కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా వ్యాఖ్యలు
- సైనికుల త్యాగాలను అవమానించడమే
- తీవ్రంగా మండి పడ్డ భారతీయ జనతా పార్టీ
- తమ పార్టీకి సంబంధం లేదన్న కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: కాంగ్రెస్ సీనియర్ నేత, ఓవర్సీస్ విభాగం ఇన్‌ఛార్జి శామ్ పిట్రోడా మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఏఐఎన్ఎస్ న్యూస్ ఏజెన్సీకి ఆయన తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో చైనాపై భారత వైఖరిని విమర్శించారు. 'చైనాతో వచ్చిన ముప్పేంటో నాకు అర్థం కావడం లేదు. శత్రువుగా చూపించగలిగే అమెరికా స్వభావం వల్లే ఈ భావన పెరిగిందని అనుకుంటున్నా. దేశాలన్నీ ప్రతిఘటించుకోవడం ఆపేసి సహకరించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని నేను నమ్ముతున్నా. మొదటి నుంచి మనం ఘర్షణాత్మక వైఖరి అవలంబిస్తున్నాం. ఇది శత్రువులను తయారుచేస్తున్నది. ఈ ఆలోచనావిధానాన్ని మనం మార్చుకోవాలి. చైనాను శత్రువుగా చూడటం మానుకోవాలి' అని శామ్ పిట్రోడా వ్యాఖ్యానించారు.

గల్వాన్ అమరులకు అవమానం

శామ్ పిట్రోడా వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. చైనాతో కాంగ్రెస్ ఒప్పందం ఈ వ్యాఖ్యలతో స్పష్టమవుతున్నదని బీజేపీ ఎంపీ సుధాన్షు త్రివేది ఆరోపించారు. భారతదేశ గుర్తింపు, దౌత్యం, సార్వభౌమత్వానికి ఈ వ్యాఖ్యలు బలమైన దెబ్బ అని పేర్కొన్నారు. గల్వాన్ లోయలో మరణించిన మన 20 మంది సైనికులను ఇది అవమానించడం కాదా అని ప్రశ్నించారు. పిట్రోడా వ్యాఖ్యలు భారత సైన్యం, సైనికుల త్యాగాలను అవమానించడమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు భారతదేశ జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలకంటే చైనా ప్రయోజనాలే ముఖ్యమని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి ఆరోపించారు. కాగా, పిట్రోడా వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ అభిప్రాయాలు కావని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వివరణ ఇచ్చారు.

రాహుల్ 'డ్రోన్' వీడియోపై విమర్శలు

దేశంలో డ్రోన్ల తయారీ రంగం వృద్ధి చెందాలంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ఓ వీడియో వివాదాస్పదమైంది. ఆదివారం సోషల్ మీడియాలో రాహుల్ గాంధీ ఈ వీడియోను పోస్ట్ చేశారు. 'డ్రోన్లు కేవలం సాంకేతికత కాదు. బలమైన పారిశ్రామిక వ్యవస్థ తయారు చేసిన అత్యున్నమైన ఆవిష్కరణలు. దురదృష్టవశాత్తూ దీనిని అందుకోవడంలో ప్రధాని మోదీ విఫలమయ్యారు. ఆయన ఏఐపై టెలిప్రాంప్టర్లతో ప్రసంగాలు ఇస్తుండగా, మన పోటీదారులు మాత్రం కొత్త సాంకేతికతల్లో ప్రావీణ్యం పొందుతున్నారు. భారత్‌లో డ్రోన్ల తయారీకి బలమైన పునాది కావాలి. ఉత్త మాటలు కాదు.' అని రాహుల్ ఈ వీడియోలో పేర్కొన్నారు.

రాహుల్‌పై ప్రశ్నలవర్షం

ఈ వీడియోలో రాహుల్ గాంధీ ఒక డ్రోన్ ఎగరేస్తూ కనిపించారు. ఇది 2022లోనే భారత్‌లో నిషేధించిన చైనాకు చెందిన డీజేఐ కంపెనీకి చెందిన డ్రోన్ అని డ్రోన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(డీఎఫ్ఐ) అధ్యక్షుడు స్మిత్ షా ఆరోపించారు. 'నిషేధిత డ్రోన్‌ను ఆయన ఎలా పొందారు? 2021 డ్రోన్ నిబంధనల ప్రకారం అన్ని డ్రోన్లు డిజిటల్‌స్కైలో నమోదు చేసుకోవాలి. డ్రోన్ ఎగరేయడానికి రిమోట్ పైలట్ సర్టిఫికెట్ ఉండాలి. రాహుల్‌కు ఈ సర్టిఫికెట్ ఉందా? రెడ్ జోన్‌లో డ్రోన్ ఎగరేయడానికి అనుమతి తీసుకున్నారా' అంటూ స్మిత్ షా ప్రశ్నలవర్షం కురిపించారు. దేశంలో 400 డ్రోన్ల తయారీ పరిశ్రమలు ఉన్నాయని, 50 కంపెనీలు డ్రోన్ల పరికరాలను తయారు చేస్తున్నాయని తెలిపారు. దేశాన్ని కిందకు లాగేందుకు అబద్ధపు ప్రచారం మానుకోవాలని రాహుల్ గాంధీకి ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహన్ దాస్ పై సూచించారు.

కొత్త సీఈసీ జ్ఞానేశ్‌కుమార్

మరో కమిషనర్‌గా డాక్టర్ వివేక్ జోషి ఎంపిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: కొత్త చీఫ్ ఎలక్షన్ కమిషనర్(సీఈసీ)గా జ్ఞానేశ్ కుమార్ ఎంపికయ్యారు. ఈమేరకు రాష్ట్రపతి కార్యాలయం గెజిట్ నోటిఫికేషన్ విడుదలైనట్టు కేంద్ర న్యాయ శాఖ సోమవారం రాత్రి వెల్లడించింది. ప్రస్తుత సీఈసీ రాజీవ్ కుమార్ పదవీకాలం ఫిబ్రవరి 18తో ముగియనుండటంతో నూతన సీఈసీని సోమవారం ఎంపిక చేశారు. అంతకుముందు ఇదే అంశంపై సమావేశమైన ప్రధాని మోదీ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ తదుపరి సీఈసీ పేరును ఎంపిక చేసి, రాష్ట్రపతికి సిఫారసు చేసింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, విపక్ష నేత రాహుల్ గాంధీలు ఈ భేటీలో పాల్గొన్నారు. 26వ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమితులైన జ్ఞానేశ్‌కుమార్..2029 జనవరి 26 వరకు ఆ పదవిలో కొనసాగనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘంలో మరో కమిషనర్‌గా హర్యానాకు చెందిన 1989 బ్యాచ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ వివేక్ జోషి ఎన్నికల కమిషనర్‌గా నియమితులయ్యారు. జ్ఞానేశ్ కుమార్ కేరళ క్యాడర్‌కు చెందిన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి.

త్వరలో అందుబాటులోకి వర్టికల్ టేకాఫ్ ఎయిర్ అంబులెన్సులు

న్యూఢిల్లీ: అత్యవసర వైద్య రవాణాలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ ఎయిర్ అంబులెన్సు సర్వీసులను భారత్ త్వరలో ప్రవేశపెట్టనున్నది. రన్‌వే అవసరం లేకుండా నిటారుగా టేకాఫ్, ల్యాండింగ్(వీటీఓఎల్) అయ్యే ఎయిర్ అంబులెన్సు సర్వీసులున్న కొద్ది దేశాలలో భారత్ కూడా త్వరలో చేరనున్నది. ఐఐటీ మద్రాస్ స్టార్టప్ ఈప్లేన్, ప్రముఖ అంబులెన్సు సంస్థ ఐక్యాట్ మధ్య రూ. 8,684 కోట్ల ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా 788 ఎలక్ట్రిక్ ఎయిర్ అంబులెన్సులను ఈప్లేన్ అందచేయాల్సి ఉంటుంది. ప్రతి జిల్లాలో ఒక ఎయిర్ అంబులెన్సును అందుబాటులో ఉంచుతారు.

బీజేపీ ఆదాయం 4,340 కోట్లు!

- 6 జాతీయ పార్టీలకు వచ్చిన విరాళాల్లో 75% కమలం ఖాతాలోకే
- 1,225 కోట్ల రూపాయలతో రెండో స్థానంలో కాంగ్రెస్ పార్టీ
- ఆదాయంలో 50 శాతమే ఖర్చు చేసిన కమలనాథులు
- 83 శాతం వ్యయం చేసిన కాంగ్రెస్
- ఆదాయానికి మించి ఖర్చు చేసిన ఆమ్‌ఆద్మీ పార్టీ, ఎన్సీపీ
- 2023-24 ఏడీఆర్ నివేదిక

ఢిల్లీ, ఫిబ్రవరి 17: 2023-24 ఆర్థిక సంవత్సరంలో దేశంలోని జాతీయ పార్టీలకు వచ్చిన విరాళాల్లో అత్యధికంగా రూ.4,340.47 కోట్లు పొందిన కేంద్రంలోని అధికార బీజేపీ మొదటిస్థానంలో నిలిచింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం 2022-23తో పోలిస్తే కమలం పార్టీ ఆదాయం 83.85 శాతం పెరిగింది. దేశంలోని 6 జాతీయ పార్టీలకు వచ్చిన మొత్తం రూ.5,820.91 కోట్ల విరాళాల్లో బీజేపీ వాటా 75 శాతం కావడం గమనార్హం. ఈ మేరకు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్(ఏడీఆర్) సోమవారం తన నివేదికలో వెల్లడించింది. రూ.1225.11 కోట్లతో కాంగ్రెస్ పార్టీ రెండోస్థానంలో నిలిచింది. హస్తం పార్టీ గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 170.82 శాతం పెరుగుదలతో 772.74 కోట్లు ఎక్కువ విరాళాలు పొందింది. ఆ తర్వాత రూ.167.63 కోట్లతో సీపీఐ(ఎం), రూ.64.77 కోట్లతో బీఎస్పీ, రూ.22.68 కోట్లతో ఆప్, రూ.22.44 లక్షలతో ఎన్సీపీ వరుసగా నిలిచాయి.

బీజేపీ ఖర్చులు 50 శాతమే

బీజేపీ తన ఆదాయంలో రూ.2,211.69 కోట్లు (50.96 శాతం) వ్యయం చేయగా.. కాంగ్రెస్ పార్టీ రూ.1025.24 కోట్లు (83.69 శాతం) ఖర్చు చేసినట్టు ఏడీఆర్ తెలిపింది. సీపీఐ (ఎం) రూ.127.28 కోట్లు (75.93 శాతం), బీఎస్పీ రూ.43.18 కోట్లు (66.67 శాతం) ఖర్చు చేశాయి. ఆప్, ఎన్సీపీ తమ ఆదాయానికి మించి ఖర్చులు చేసినట్టు ఏడీఆర్ నివేదించింది. ఆప్ రూ.34.09 కోట్లు ఖర్చు చేసింది.

ఎలక్టోరల్ బాండ్ల రూపంలోనే ఎక్కువ

జాతీయ పార్టీలకు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో ఎక్కువ ఆదాయం సమకూరింది. బీజేపీకి రూ.3,967.14 కోట్లు, కాంగ్రెస్ రూ.1,129.66 కోట్లు, సీపీఐ (ఎం) రూ.74.68 కోట్లు, ఆప్ రూ.22.13 కోట్లు పొందాయి.

ఎన్ఈపీపై డీఎంకే యుద్ధభేరి

చెన్నై: జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)కి వ్యతిరేకంగా మంగళవారం చెన్నైలో పెద్ద ఎత్తున ధర్నా చేయనున్నట్లు డీఎంకే సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఎన్ఈపీని అంగీకరించే వరకు తమిళనాడు విద్యా శాఖకు నిధులు ఇవ్వబోమని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్రానికి నిధుల కేటాయింపులో ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించింది. యూజీసీ ద్వారా రాష్ట్ర విద్యా వ్యవస్థను దెబ్బ తీసేందుకు ప్రయత్నిస్తున్నదని మండిపడింది.

ఎన్ఈపీ అమలుకు కట్టుబడి ఉన్నాం

ఎన్ఈపీని దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారు. ఎన్ఈపీ హిందీని కానీ, వేరొక భాషను కానీ విద్యార్థులపై రుద్దబోదన్నారు.

ఒడిశాలో నేపాలీ విద్యార్థిని మృతిపై నిరసనలు

భువనేశ్వర్: ఒడిశాలోని కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ (కేఐఐటీ)లో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న ప్రకృతి లంసల్ ఆదివారం అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు కోల్పోయింది. ఆమె తన హాస్టల్ గదిలో ఆత్మహత్య చేసుకున్నట్లు కేఐఐటీ వర్గాలు తెలిపాయి. ఈ సంఘటనపై నిరసన తెలిపిన సుమారు 500 మంది నేపాలీ విద్యార్థులను హాస్టల్ నుంచి ఖాళీ చేయించి, పంపించేశారు. నేపాల్ పీఎం కేపీ శర్మ ఓలి ఫేస్‌బుక్ పోస్ట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ, దౌత్య మార్గాల్లో సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు.

'పిటిషన్లకు పరిమితి ఉండాలి'

న్యూఢిల్లీ: ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనల) చట్టం, 1991 చెట్లబాటుపై కొత్త పిటిషన్లు దాఖలవుతుండటం పట్ల సుప్రీంకోర్టు సోమవారం అసహనం వ్యక్తం చేసింది. పిటిషన్లు దాఖలు చేయడానికి ఓ పరిమితి ఉంటుందని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం చెప్పింది. సీనియర్ అడ్వకేట్ ఇందిర జైసింగ్ ఓ కక్షిదారు తరపున కొత్త పిటిషన్‌ను దాఖలు చేసినపుడు ఈ వ్యాఖ్యలు చేసింది.

రద్దీలో జన నియంత్రణకు కొత్త విధానం

- 60 రైల్వే స్టేషన్లపై ప్రధాన దృష్టి
- కృత్రిమ మేధ వినియోగం

న్యూఢిల్లీ: జన సమ్మర్థం అధికంగా ఉండే 60 రైల్వే స్టేషన్లలో అదనపు ప్రయాణికుల రద్దీని సజావుగా నిర్వహించేందుకు పర్మనెంట్ హోల్డింగ్ జోన్స్‌ను నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, దీని కోసం కృత్రిమ మేధ (ఏఐ)ని కూడా ఉపయోగించాలని భావిస్తున్నది. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 18 మంది మరణించిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ ఆలోచన చేస్తున్నది. దీనిలో భాగంగా, సంక్షోభ నిర్వహణ, పరిస్థితులపై అవగాహనలో స్థానిక అధికారులకు శిక్షణ ఇస్తారు. ప్రయాణికులను డిజిగ్నేటెడ్ హోల్డింగ్ ఏరియాస్ వైపు పంపించేందుకు బాణం గుర్తులు, సెపరేటర్స్‌ను ఏర్పాటు చేస్తారు. కృత్రిమ మేధతో సహా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటారు. ముఖ్యంగా రైళ్లు ఆలస్యమైనపుడు ప్రయాణికులను పర్యవేక్షించేందుకు వీటిని ఉపయోగిస్తారు.

స్కూళ్ల నిర్మాణానికి 2 వేల కోట్ల విరాళం

గౌతమ్ అదానీ ప్రకటన

అహ్మదాబాద్: అందరికీ అందుబాటులో నాణ్యమైన విద్యను అందించేందుకు దేశవ్యాప్తంగా ప్రపంచ శ్రేణి పాఠశాలలను నిర్మించనున్నట్టు అదానీ గ్రూపు చైర్‌పర్సన్ గౌతమ్ అదానీ సోమవారం ప్రకటించారు. ఇందు కోసం అదానీ కుటుంబం నుంచి రూ.2 వేల కోట్ల విరాళాన్ని ప్రాథమికంగా ప్రకటించారు. ప్రపంచ శ్రేణి విద్యను, బోధనా సౌకర్యాలను సమాజంలోని అన్ని వర్గాలకు అందుబాటులో తీసుకురావడమే తమ లక్ష్యమని అదానీ వెల్లడించారు. తమ భాగస్వామ్యంలో మొదటి పాఠశాల 2025-26 విద్యా సంవత్సరంలో లక్నోలో ప్రారంభమవుతుందని ఎక్స్ వేదికగా అదానీ ప్రకటించారు. తాము నిర్మించనున్న ప్రపంచ శ్రేణి పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌లోని 30 శాతం సీట్లు పేద పిల్లలకు ఉచితంగా కేటాయిస్తామని ఆయన వెల్లడించారు. మూడేండ్ల ఇలాంటి 20 బడులు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు.

కెంటకీ రాష్ట్రంలో వరదల కారణంగా జలమయమైన ఓ నివాస ప్రాంతం

అమెరికాలో వరదల బీభత్సం

కెంటకీలో 9 మంది మృతి.. కొనసాగుతున్న సహాయక చర్యలు

వాషింగ్టన్ : అమెరికాలోని టెన్నెసీలో ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. కెంటకీలో 7 అంగుళాల వర్షపాతం నమోదైంది. కెంటకీ గవర్నర్ ఆండీ బెషీర్ మాట్లాడుతూ, శని, ఆదివారాల్లో వరదల్లో చిక్కుకున్నవారిని బయటకు తీసుకొచ్చిన సంఘటనలు 1,000కిపైగా నమోదయ్యాయన్నారు. నాలుగు రాష్ట్రాల్లో అనేక చోట్ల తీవ్ర స్థాయిలో వరదలు సంభవించాయి. దీంతో టెన్నెసీలో కాలువల కట్టలు తెగిపోయాయి. కెంటకీలో 9 మంది మరణించారు. వీరిలో ఓ మైనర్ కూడా ఉన్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని బెషీర్ తెలిపారు. పశ్చిమ, ఉత్తర టెన్నెసీ, దక్షిణ కెంటకీ, వెస్ట్ వర్జీనియా-వర్జీనియా సరిహద్దుల్లో అనేక ప్రాంతాల్లో రోడ్లు తీవ్రంగా దెబ్బతినడంతో, వాటిని మూసివేశారు. వరదల వల్ల రాష్ట్రవ్యాప్తంగా రోడ్లపై ప్రభావం పడటం అనేక సంవత్సరాల తర్వాత ఇదే మొదటిసారి అని రవాణా శాఖ అధికారులు చెప్పారు.

టికెట్లు లేకుండా ప్రయాణానికి మోదీ అనుమతిచ్చారు!

కుంభ మేళా ప్రయాణికుల జవాబుతో కంగుతిన్న అధికారి

పాట్నా: రైల్లో టికెట్లు లేకుండా ప్రయాణించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ అనుమతించారన్న బీహారీ మహిళల సమాధానం విని ఓ రైల్వే డివిజినల్ మేనేజర్(డీఆర్ఎం) అవాక్కయ్యారు. మహా కుంభమేళా సందర్భంగా యూపీలోని బక్సర్ రైల్వే స్టేషన్‌లో ఈ ఘటన జరిగింది. కుంభమేళాకు యాత్రికుల రద్దీ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆదివారం డీఆర్ఎం జయంత్ కుమార్ బక్సర్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పట్టాల దగ్గర ఉన్న మహిళలు టికెట్లు లేకుండా రైల్లో ప్రయాగ్ రాజ్ వెళ్లడానికి వచ్చారని తెలుసుకొని ఆశ్చర్యపోయారు. 'టికెట్లు లేకుండా ప్రయాణం చేయొచ్చని మీకు ఎవరు చెప్పారు' అని ఆయన వారిని ప్రశ్నించారు. 'నరేంద్ర మోదీ మాకు అలా చెప్పారు' అని వారు జవాబిచ్చారు. దీంతో షాక్ తిన్న డీఆర్ఎం కొన్ని సెకండ్ల తర్వాత తేరుకుని.. అది తప్పుడు సమాచారమని వారికి తెలిపారు.

యుద్ధ విరమణ దిశగా అడుగులు

నేడు అమెరికా, రష్యా అధికారుల సమావేశం

త్వరలో ట్రంప్ - పుతిన్ - జెలెన్‌స్కీ చర్చలు!

రియాద్, ఫిబ్రవరి 17: మూడేండ్లుగా మారణహోమాన్ని సృష్టిస్తున్న రష్యా - ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. ఈ మేరకు సౌదీ అరేబియా కేంద్రంగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మంగళవారం రియాద్‌లో అమెరికా, రష్యా ప్రతినిధుల బృందాలు సమావేశం కానున్నాయి. అమెరికా తరపున విదేశాంగ మంత్రి మార్కో రుబియో, ట్రంప్ రాయబారి స్టీవ్ విట్కాఫ్, జాతీయ భద్రతా సలహాదారు మైక్ వాల్జ్‌జ్ ఈ చర్చల్లో పాల్గొననున్నారు. రష్యా తరపున విదేశాంగ మంత్రి సెర్గేయ్ లావ్రోవ్, పుతిన్ విదేశీ వ్యవహారాల సలహాదారు యురి ఉషాకోవ్ సమావేశానికి హాజరుకానున్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధవిరమణ ఒప్పందం, అమెరికా - రష్యా మధ్య సంబంధాల పునరుద్ధరణపై ఈ సమావేశంలో చర్చలు జరగనున్నాయి. యుద్ధవిరమణ ఒప్పందం కోసం తదుపరి కార్యాచరణ సైతం ఖరారయ్యే అవకాశం ఉంది. త్వరలో అమెరికా, రష్యా, ఉక్రెయిన్ అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, వ్లాదిమిర్ పుతిన్, జెలెన్‌స్కీ మధ్య తుది చర్చలు జరగనున్నాయి. వీరి భేటీపై కూడా మంగళవారం ఒక స్పష్టత వచ్చే అవకాశముంది.

జెలెన్‌స్కీ పాల్గొంటారా?

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సైతం ముందే ఖరారైన షెడ్యూల్ ప్రకారం బుధవారం సౌదీ అరేబియాలో పర్యటించనున్నారు. అమెరికా - రష్యా ప్రతినిధుల చర్చల్లో ఉక్రెయిన్ భాగమవుతుందని డొనాల్డ్ ట్రంప్ ఆదివారం ప్రకటించారు. అయితే, తమ దేశానికి ఆహ్వానం రాలేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సోమవారం ప్రకటించారు. తమ దేశం పాత్ర లేకుండా జరిగే చర్చలు ఫలితాలను ఇవ్వవని, ఈ చర్చల ఫలితాన్ని ఉక్రెయిన్ అంగీకరించదని ఆయన స్పష్టం చేశారు.

గాజాను వదులుకుంటాం!

పాలస్తీనియన్ అథారిటీకి అప్పగిస్తాం ■ ఈజిప్ట్ ఒత్తిడితో హమాస్ అంగీకారం

జెరూసలేం, ఫిబ్రవరి 17: ఇజ్రాయెల్ - హమాస్ యుద్ధంలో కీలక పరిణామం చోటుచేసుకున్నది. దాదాపు రెండు దశాబ్దాలుగా పాలిస్తున్న గాజాను వదులుకునేందుకు హమాస్ సిద్ధపడింది. గాజా పరిపాలనను పాలస్తీనియన్ అథారిటీ(పీఏ)కు అప్పగించేందుకు హమాస్ అంగీకరించినట్టు స్కైన్యూస్ అరేబియాలో ఒక కథనం ప్రచురితమైంది. ఇజ్రాయెల్ - హమాస్ మధ్య యుద్ధ విరమణకు మధ్యవర్తిగా ఉన్న ఈజిప్ట్ ఒత్తిడి మేరకు హమాస్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది. అయితే, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాత్రం భిన్నంగా స్పందించారు. యుద్ధం ముగిసిన తర్వాత గాజాలో హమాస్, పాలస్తీనియన్ అథారిటీ ఉండదని ఆయన సోమవారం మరోసారి స్పష్టం చేశారు. ప్రజలను ఖాళీ చేయించి, గాజాను పునర్నిర్మించాలనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రణాళికకు కట్టుబడి ఉంటామని తెలిపారు. 2007 నుంచి గాజా హమాస్ ఆధీనంలో ఉంది. ప్రస్తుతం గాజాలో పోలీస్, ఆరోగ్య, పౌర సేవలు హమాస్ నియంత్రణలో ఉన్నాయి. కాగా, పాలస్తీనా ప్రభుత్వంగా పీఏను అంతర్జాతీయ సమాజం గుర్తించింది. ప్రస్తుతం వెస్ట్ బ్యాంక్ ప్రాంతం పీఏ పరిపాలనలో ఉంది.

మొసళ్లు, పాముల నుంచి తప్పించుకుంటూ!

అమెరికా డిపోర్టీల 'డంకీ' కష్టాలు

చండీగఢ్, ఫిబ్రవరి 17: అమెరికాకు చట్టబద్ధంగా తీసుకువెళతామని వాగ్దానం చేసిన ట్రావెల్ ఏజెంట్లు మోసం చేసి డంకీ మార్గంలో తీసుకెళ్లడంతో పంజాబ్‌కు చెందిన మన్‌దీప్ సింగ్ తన ప్రాణాన్ని పణంగా పెట్టి మొసళ్లు, పాముల నుంచి కాపాడుకుంటూ తన కలల స్వర్గం అమెరికాను చేరుకోగలనని భావించాడు. సిక్కు మతానికి చెందిన వాడైనప్పటికీ తన గడ్డాన్ని క్లీన్‌షేవ్ చేయాల్సి వచ్చింది. తన కుటుంబానికి మంచి జీవితాన్ని అందచేయాలన్న ఏకైక లక్ష్యంతో అమెరికా వెళ్లేందుకు అష్టకష్టాలు పడ్డ మన్‌దీప్ కన్న కలలన్నీ అరెస్టుతో పేకమేడల్లా కూలిపోయాయి. మెక్సికోలోని టిజువానా నుంచి అమెరికాలోకి చొరపడేందుకు ప్రయత్నించి జనవరి 27న అమెరికా సరిహద్దు గస్తీ పోలీసులకు మన్‌దీప్ దొరికిపోయాడు. ఆదివారం రాత్రి చండీగఢ్ విమానాశ్రయం చేరుకున్న 112 మంది అక్రమ వలసదారులకు చెందిన మూడవ విమానంలో మన్‌దీప్ సింగ్ కూడా ఉన్నాడు. పంజాబ్‌కు చెందిన మన్‌దీప్ సింగ్(38) తన డంకీ ప్రయాణ అనుభవాలను మీడియాతో పంచుకున్నాడు. ఆ ప్రయాణానికి సంబంధించిన వీ